1 RSVM01A131

# గ్రంథాలయ సర్వస్వము.

సంపు. ౭ | బెజవాడ—ఆగష్టు ౧౯౨౮. | సంచిక ౨.

## గ్రంథములు

(ఆచంట సూర్యనారాయణ సాంఖ్యాయనశర్మగారు.)

సీ. మంచి మందంచును ♦ సంచిలో నుంచిన
రోగంబు మాన్పి యా♦రోగ్య మిడునె?
ఫలము మంచి దటంచు ♦ వర్ణించి తినకుండ
దాఁచినచో జిహ్వ ♦ తనియఁగలదె?
చల్లదనంబిచ్చు ♦ చందనం బనిచెప్పి
పూయక సుఖమెట్లు ♦ పొందఁ గలఁడు?
భాగ్యంబు గలదంచు ♦ వాడకయుండిన
భాగ్యసౌఖ్యము వాఁడు ♦ వడయు నెట్లు?
జ్ఞానదాయక గ్రంథముల్ ♦ చాలదెచ్చి
బీరువాలను నిండించి ♦ పెట్టునంత
జ్ఞానభాగ్యంబు గలుగదు ♦ చదువకున్న
ఇంటిలో విత్తులుంచఁ జే ♦ నెట్లు పండు?

---

## చీనాదేశ శిలామయ విజ్ఞాన నిధులు

చీనాదేశమందలి శిలామయ గ్రంథాలయములయొక్క చరిత్ర చాల ప్రాచీనమైనది. క్రీస్తుపూర్వము 3 వ శతాబ్దమున "ట్సెన్‌షిహి హ్యాంగు" అను చక్రవర్తి ఆదేశమును పరిపాలించెను. ఈతను ప్రజలను పీడించుటయందు ప్రపంచమందంతటను నద్వితీయుఁడు. అతనికి లిస్జియను

మంత్రి యుండెను. ప్రజలలో విజ్ఞానము వ్యాపించకుండ నాశనము చేసినచో ప్రజలను ఎల్లకాలమును పరిపాలన చేయవచ్చు నని ఈమంత్రి తన చక్రవర్తికి సలహా నిచ్చెను.

క్రీస్తుశకమునకు పూర్వము 213 సం॥రం॥లో ఈకథ జరిగినది. చక్రవర్తికి ఈమంత్రి ఒక విన్నపమును నివేదించెను. అది ఇట్లున్నది.

"ఓ రాజచంద్రమా! ప్రపంచ మంతటను ప్రకాశించుచున్న మీ యశః కాంతిచేతను, నద్వితీయ మగు మేధాశక్తిచేతను పూర్వపు చక్రవర్తులకంటె తీసిపోని విస్తీర్ణముగలరాజ్యమును మీరు జయించి పరిపాలించుచున్నారు. మీఔన్నత్యమును శాశ్వతముగా చేసికొనవలెనన్న మీ దృష్టిని పండితులవైపుకు త్రిప్పవలెను. వీరివలన మిక్కిలి ప్రమాదములు కలుగును. వారి ఉద్దేశములను నేను జాగరూకతతో గమనించుచున్నాను. వారి అంతఃకరణయందలి భావములనుబట్టి వారు మీకు శాశ్వత శత్రువులు. ఇంతకంటె వివరముగా నేను చెప్పలేను. తాము శాసనములను వేనినైనను జారీచేసిన వెంటనే అందు ఏదోయొక అన్యాయమునుగాని, అధమము నిరర్థకత్వమునుగాని కనిపెట్టెదరు. పూర్వకాలపు న్యాయపరిపాలకులగురాజులకాలము నాటి శాసనములను తమశాసనములనుపోల్చితమయందు న్యూనతనునిరూపించెదరు. సర్వదా ఇట్లుచేయుచుండుటచే ప్రజలయందు రాజద్రోహము రానురానువృద్ధియై తిరుగబాటు చేయుటకు ఉద్రేక మేర్పడును. ఇట్టిసందర్భమునందు కర్తవ్యమును సూచించెదను. మృదుత్వమువలన పరిస్థితులు బాగుపడవు. ఈ ఉపద్రవమును వెంటనే నిర్మూలము జేయవలసి యున్నది. గ్రంథముల వలననేకదా ఈపండితులయందు ఇట్టి యాశయము లుండుటకు కారణమైనది. కావున వారివద్దనుండి ఆపుస్తకములను లాగికొందము. శాశ్వతముగా ఈగ్రంథములను నష్టపరచినచో ఈపండితులయొక్క ప్రతిదినము వృద్ధి నొందుచున్న పొగరుబోతుతనమును, అంతులేని మొండి తనమును నశించును. వైద్య శాస్త్రమును వ్యవసాయశాస్త్రమును, జ్యోతిషమును, తమయశశ్చంద్రికలను వెదజల్లు గ్రంథములను మాత్రము ఉంచి మిగిలిన గ్రంథములన్నియు నిరర్థకమైనవగుటచే.

దహనము చేయవలసిన దని శాసించుఁడు. ప్రాచీన చరిత్రలును, సనాతన ధర్మములును లేనిచో, తమ రాజ్యపరిపాలనను ఈపండితాధములు అసహ్యముగా నుండునట్లు పూర్వపురాజుల పరిపాలనతో పోల్చి చెప్పరు.

మీామత గురువులతోనే ప్రారంభింపుడు. వారు చరిత్రవిజ్ఞానముతో నిండి యున్నవారు. అనాదినుండి సంరక్షింప బడుచున్న విజ్ఞాననిధులను భస్మీపటలము చేయుమని వారల కాజ్ఞాపింపుడు. ధర్మశాస్త్రములను సంరక్షించు న్యాయాధికారులకుకూడ ఇట్లే యాజ్ఞ యొసంగుడు. కావ్యములనుకూడ ఇట్లేచేయుడు. ఇవియన్నియు విస్మరణీయములు. వీని నన్నిటిని దగులబెట్టుడు.''

విశ్వసించుటకు వీలులేని ఈదుర్మార్గమునకు రా జంగీకరించి నిశ్చయముగా కార్యరూపము నొందించుటకే కృతనిశ్చయుఁ డాయెను. గ్రంథములను సేకరించి కాపాడుచున్న వారందరు 30 దినములలోగా రాజభటులకు వానిని స్వాధీనపర్చ వలసిన దనియు లేనిచో మరణశిక్ష విధింపబడు ననియు రా జొకశాసనమును ప్రకటించెను. ఈదుష్కార్యమునకొడిగట్టని 460 మంది వజ్రసంకల్పు లగు పండితులు వారిగ్రంథములతోకూడ ఒక అగాధమునందు త్రోయబడి పూడ్చబడిరి. రాజ్యమందంతటను "హాహా" కారము పుట్టెను. కొన్నివత్సరములు గడచిన పిదప "త్సిను"వంశము తుద ముట్టినది. అటుపిమ్మటరాజ్యము నధిష్ఠించిన "హ్యూ" చక్రవర్తి ఉద్గ్రంథములను చదువకూడ దను శాసనమును రద్దుపరచి, ఇంతకాలమునుండి నిక్షిప్తముచేసిన గ్రంథరాజముల నన్నిటిని సేకరించుటకు ఆజ్ఞ నొసంగెను. మరియు వెనుకటి దుర్మార్గ చక్రవర్తివలె ఎవ్వరును ఎప్పటికినికూడ అవినీతిమార్గముల ప్రవర్తించకుండ భద్రము చేయుటకుగాను గ్రంథములను శిలాశాసన బద్ధముగ చేయునట్లు యాజ్ఞ చేసెను. ఇది చీనాదేశముయొక్క శిలాశాసన వాఙ్మయముయొక్క ఉత్పత్తి.

పిమ్మట ఎనమండుగురు చక్రవర్తులు తమకమపరిపాలనలయందు ఈవిజ్ఞానధనమును వృద్ధిపరచిరి. ఇట్లు వృద్ధిపరచినవారిలో మొదటివాఁడు

క్రీస్తుశకము 172 సంవత్సరములో సింహాసన మెక్కిన "హాను" వంశపు చక్రవర్తి "లిస్టి"యను నాయన. ఆయన పద్యవాఙ్మయము చరిత్ర, ఖగోళశాస్త్రము, కర్మశాస్త్రము, కాలశాస్త్రములను గూర్చిన గ్రంథములను శిలామయ విజ్ఞాననిధియందు చిత్రింపజేసెను. ఈ వాఙ్మయమునంతను కాగితములపై ఎత్తవలెనన్న 6000 పెద్దటావుల కాగితము పట్టును.

"పికీను" రాజధానియందు రాజపుత్రులకు విద్యాభివృద్ధి చేయుటకై స్థాపింపబడిన శిలాశాసనపు విజ్ఞాననిధి యొకటి యున్నది. ఇందు సంవత్సరమున కొకతూరి చక్రవర్తి ఉపన్యాసమును వినుటకు వెళ్లును. అచ్చట రాజధర్మములను గూర్చిన సద్బోధను వినును. తద్వ్యతిరేకముగ ప్రవర్తించినందుకు మందలింపును పొందును. మరియు శిలాశాసనవిజ్ఞాననిధియందు చక్రవర్తి చీనాదేశముయొక్క విజ్ఞానమును గూర్చి ధ్యానముచేసి ప్రజలను పరిపాలించుటకు కావలసిన పరిజ్ఞానము నొసంగుటకు వరమును ప్రార్థించును.

"చూపూ" రాష్ట్రమందలి పాంటెంగు పట్టణమున ఇట్టి ప్రతిష్ఠాపనయే మరియొకటియున్నది. ఇచ్చటనే చీనాదేశమత ప్రవక్తయగు "కనుఫ్యూషియసు" యొక్క సమాధియున్నది. ఇప్పు డీమండలమును పాలించుచున్నది ఈసంయమీంద్రుని వంశీకుడే. చీనాదేశమునకంతకు సుప్రసిద్ధి వహించిన "కనుఫ్యూషియసుయొక్క" పూజకొరకై నిర్మింపబడిన దేవళ మిచ్చటనున్నది. ఇందు ఈమునిపుంగవుని ధర్మములు శిలలపై లిఖింపబడియు చిత్రింపబడియు నున్నవి.

ఇంత యద్భుతములగు ప్రతిష్ఠాపనలు మనుజునకు ఎల్లకాలములయందు కూడ ఆశ్చర్యమును భక్తిని జనింపచేయకుండవుగదా?

---

# హుగ్లీ జిల్లా గ్రంథాలయ మహాసభ
## తీర్మానములు

1. వంగదేశ గ్రంథాలయ సంఘము ఏర్పాటు చేయడమైనది. దీనికి అనుబంధముగ హుగ్లీజిల్లా గ్రంథాలయ సంఘము ఏర్పాటు చేయడమైనది.

హుగ్లీజిల్లా గ్రంథాలయ సంఘమును అఖిలభారత గ్రంథాలయ సంఘమునకు శాఖగా చేర్చడమైనది.

2. జిల్లాబోర్డులు, లోకలుబోర్డులు, మునిసిపాలిటీలును ఇతర సంస్థలును గ్రంథాలయాభివృద్ధి నిమిత్తము పనిచేయవలసిన దనియు, గ్రంథాలయములకు ద్రవ్యసహాయము చేయవలసిన దనియు తీర్మానించడమైనది.

3. సాంఘిక సేవజేయుటయు, తమ తమ గ్రామములందు విద్యాభివృద్ధి నిమిత్తము పాటుపడుటయు, తమ గ్రామముయొక్క ఆర్థిక సమస్యలను దీర్చుటయు, గ్రంథాలయముల ప్రథమధర్మము. ఈతీర్మానమును అమలులో పెట్టుటకును, వారు చేసిన విచారణ ఫలితములను ఈసభ తిరిగి కూడుటకు పూర్వము ఒక నెల ముందుగా జిల్లా గ్రంథాలయ సంఘమునకు పంపుటకును, ప్రతిగ్రంథాలయసంఘమును ఉపసంఘము నొకదానిని ఏర్పాటు చేయవలెను.

4. ఈజిల్లాయందున్న గ్రంథాలయముల డైరెక్టరీ నొకదానిని తయారు చేయుటకు తీర్మానించడమైనది. అన్నిసంఘములవారును జిల్లా సంఘ కార్యదర్శిగారికి దీనిని తయారు జేయుటకై తమ సంఘముల రిపోర్టులను ఎప్పటి కప్పుడు పంపుటకు కోరడమైనది.

5. తమ గ్రామమందున్న ప్రారంభవిద్యా వ్యాపకమునకై ప్రతిగ్రంథాలయమును తగిన శ్రద్ధ తీసికొనవలెననియు, తమగ్రామమందు 2, 3 ప్రాథమిక పాఠశాలలనైన నిర్వహింపవలెనని బోర్డులను మునిసిపాలిటీలను అడుగవలెననియు, ఈసభవారు ఈజిల్లాయందలి గ్రంథాలయములను హెచ్చరించుచున్నారు.

6. హుగ్లీజిల్లా గ్రంథాలయ సంఘమునకు చేరిన గ్రంథాలయము లన్నియు, అవసరమైనప్పుడు పరస్పరము గ్రంథములను ఎరువిచ్చుకొనవలసిన దనికోరుచున్నారు.

7. ప్రతి గ్రంథాలయము కొందరు దేశసేవకులను తయారుచేయవలసిన దనియు, పండితుడుగాని గ్రంథకర్తగాని కోరినప్పుడు గ్రంథములను ఉచితముగా ఎరు విచ్చుటమూలముగాను ఇతరవిధముగాను సహాయము చేయవలసిన దనియు ఈసభవారు తీర్మానించుచున్నారు.

8. హుగ్లీజిల్లాయొక్క చారిత్రాత్మకమైనట్టియు, ఇతర విధమైనట్టియు చరిత్రను సమకూర్చవలసినదని గ్రంథాలయములను ఈసభవారు హెచ్చరించుచున్నారు.

9. గ్రంథ భాండాగారికు లందరికిని కలిపి ఒక సంఘమును ఏర్పరచుటకును, అట్టి సంఘమును నిర్మించుటకు త్వరలో జిల్లాయందున్న గ్రంథభాండాగారికు లందరిని ఒకచో జేర్చి, గ్రంథాలయ పాలనమునుగూర్చియు, విద్యార్థులందు సహకారమును గూర్చియు, గ్రంథభాండాగారికులయందు సహకారమును గూర్చియు, గ్రంథాలయముల అభివృద్ధిని గూర్చియు చర్చించుటకు తీర్మానించడమైనది.

---

# గ్రంథములగడువు—దాచియుంచుట

(యాతగిరి లక్ష్మీవేంకటరమణగారు)

చిన్న గ్రంథాలయమునకును పెద్దవానికిని గూడ చదువరులు గ్రంథమును తమవద్ద నుంచుకొనగల గడువు దినముల గరిష్ఠసంఖ్య యేర్పరుప వలసిన యావశ్యకతకలదు. ఈగడువు దినములు చదువరులయొక్కయు, గ్రంథములయొక్కయు స్వభావమునుబట్టి నిర్ణయింపదగును. కొన్ని పాత్రములు మంచినీళ్ళ ప్రాయముగా చదువగలరు. మరికొన్ని చిన్నిపాత్రము లైనను జాగ్రతగా చదివి విషయములను

మననము చేసికొనవలసిన యావశ్యకముగలదు. అందువలన అన్నితరగతుల గ్రంథములకును ఒకేకాల నియమము సరికాదు. ఒక్కొక్కతరగతి గ్రంథములకు ఒక్కొక కాలనియమముచేయవలసివచ్చును. ఒక నవలను చదువుటకు వారముదినములు సరిపోవును. ఒక వేదాంతగ్రంథమును జదువుటకు వారముదినములు బహుస్వల్పము. ప్రత్యేకతరగతికి ప్రత్యేక కాలమును నిర్ణయించుటకువీలులేనియెడలసాధారణముగగ్రంథములన్నిటికి ఎంత యెక్కువకాలము కావలెనో ఆగడువును యేర్పరుపవలెను; కనుక పదిహేను దినములు గడువు బాగుండును. ఒకే గ్రంథము తిరిగి కావలసినయెడల యిచ్చుటకు నిబంధన లుండవలెను. గ్రంథమును రెండవమారు యిచ్చునపుడు, ఆగ్రంథమునకు పదిహేను దినముల కన్న యెక్కుడుకాల మవసర మగునో కాదో. పాలకుడు గమనింపవలెను. అట్టి గ్రంథముకొరకు యింకొక దరఖాస్తు నిలువలో నున్నను దానిని వెనుకటివానికే యివ్వవలెను. అట్లు చేయనియెడల వెనుకటివానికిగానిముందువానికిగానియుపకరింపజాలదు. అట్టిగ్రంథమును తొందరగా జాలమంది చదువుటకన్న సావకాశముగా కొలదిమంది చదువుటయేలాభము. గడువుదినములలో పూర్తియగు గ్రంథమును క్రొత్త దరఖాస్తు లేకయున్నను తిరిగి యివ్వకూడదు. బహు అరుదుగా నివ్వవచ్చును.

చదువరులు గ్రంథము నుంచుకొనుటకు పదిహేనుదినముల గడువును యేర్పరచెద మనుకొందము. ఒకరు గ్రంథమును ఫిబ్రవరి 21 తేదిని తీసికొనినయెడల తిరిగి మార్చి ౮ తేదీనాడు యిచ్చివేయవలెను. ఆ దినమున గ్రంథము తిరిగి రానియెడల 3 దినములు క్షమింపవచ్చును. ఆదినములలో బుక్కుకార్డును వేరుగా నుంచవలెను. క్షమాదినములను యేర్పరుచుట గ్రంథాలయ సంఘమునకును చదువరికిని తారకము. క్షమాదినములలో చదువరి గ్రంథమును పూర్తి చేసి యిచ్చివేయవచ్చును గడువుదినములలో చదువరిగ్రంథమునుపూర్తిచేసియు కొన్ని యడ్డంకులచేత గ్రంథమును యిచ్చివేయుటకు వీలుండకపోవచ్చును. అట్టి చదువరినిశిక్షించుటన్యాయముకాదు. కనుక గ్రంథమును మార్చి 10 తేదీ

సాయంకాలమునకు యిచ్చివేయవలెను అట్లు యివ్వనియడల మార్చి 11 తేదీ యుదయమునుండియు ఆలస్యమును పరిగణింపవలెను. అప్పుడు ఆలస్యపు తాకీదునుపంపవలెను. అట్టివారికి జరిమానా విధింపవచ్చును. కొన్ని గ్రంథాలయములలో ఆలస్యమైన ప్రతిదినమునకు కొంత జరిమానా విధించుట ఆచారమైనది. కాని మన దేశమున నట్లుచేయుట ఆచరణ యోగ్యముకాదు. ఏలనన పాలకుడు చదువరుల నాకర్షించుటకు సర్వదా ప్రయత్నము చేయుచుండవలయును. జరిమానావలన చాలమంది చదువరులు భయపడుదురు. మొదటిసారి చదువువరిని హెచ్చరించుటయు, రెండవసారి కొన్ని దినములవరకు గ్రంథముల నివ్వక ఆపుటయు, మంచిపద్ధతి. చదువరి యింకను అశ్రద్ధ చేయుచుండిన యెడల చాలదినములవరకు గ్రంథమునిచ్చుట మానివేసి ఈవిషయమును నోటీసుబల్లపై ప్రచురింపవలెను. ఈపద్ధతి సాధారణ జనులందరివద్దను జయప్రదమైనట్లు నాఅనుభవము తెల్పుచున్నది. ఈనిబంధనకు యెప్పుడు లోటు రానివ్వకూడదు.

ప్రతి గ్రంథాలయమునందును దరఖాస్తురిజస్టరు నుంచుట కర్తవ్యము. దరఖాస్తుఫారము కార్డుపై అచ్చువేయించవలెను. అందు గ్రంథనామము గ్రంథకర్తనామము లుండవలయును. ఆకార్డుపైని చదువరి స్వయముగా తనచిరునామాను వ్రాయవలెను. వలయు గ్రంథము గ్రంథాలయమున చేరగనే పాలకుడు సంతకముజేసి ఆకార్డును బంట్రోతుద్వారాగాని, పోస్టుద్వారాగాని చదువరికి పంపును. పోస్టుద్వారా పంపవలసియున్నపుడు చదువరి అర్ధణాబిళ్ళ అంటింపవలెను. రిజర్వుచేసిన గ్రంథమును రిజస్టరుపై నమోదుచేయవలెను.

పెద్ద గ్రంథాలయములలో గ్రంథమును వెతకి పట్టుకొనుట చాలకష్టము. అందువలన రిజర్వుచేయుట బహుప్రయాసతో కూడియుండును. కనుపడని పొత్తముకొరకై రిజర్వుకార్డు యుంచుటవలన పాలకునిశక్తి కాలము వృథాయైపోవును. దొరుకని పొత్తముకొరకు

వేచియుండుట చదువరికి చాలకష్టము. కనుక సంచారములో నున్న గ్రంథములకు మాత్రమే రిజర్వుకార్డుల నుంచుట మంచిది.

గ్రంథసంచారము విస్తారముగానుండు పెద్ద గ్రంథాలయములో కొన్ని గ్రంథములు బాగుచేయించుటకు బైండింగుచేయుటకు వేరు చేయబడును. కొన్నిగ్రంథములు గ్రంథాలయమున నేమూలనో నిద్రించుచుండును. అట్టి గ్రంథములకై రిజర్వుకార్డుల నుంచుట నిరుపయోగము.

రిజర్వుకార్డు పుచ్చుకొనిన పిమ్మట అందులోని గ్రంథమును రిజర్వుచేయుమను ఆర్డరుతో,చీటిని అంటించి ఎరువిచ్చు గుమాస్తాకు పంపలెను. గుమాస్తా తనకడకు ఆగ్రంథము వచ్చినపుడు పాలకుని కడకు పంపవలెను. పాలకుడు కార్డును చదువరికి పంపి, గ్రంథమును వేరుగానుంచును. నియమితకాలములో చదువరి యాగ్రంథమును తీసి కొననియెడల దానిని యథాస్థానమున నుంచదగును.

ఆలస్యమైన గ్రంథములకు నోటీసులు జాగ్రతగాపంపలెను. నోటీసులు సరిగాపంపిన యెడల గ్రంథములకై అరుదుగా రిజర్వు చేయ వలసియుండును. రిజర్వుకార్డులు అనవసరముగాపడియుండనక్కర లేదు. రిజర్వుబుక్కు యేర్పాటు చేయకపూర్వము ఆలస్యమగు గ్రంథము లను తిరిగి తెప్పించుటకు సరియగు విధానము నేర్పాటు చేయవలసి యుండును.

---

# ౧౨వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ.

ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ 28-7-28 తేదీ ఉదయము గుంటూరు నందు హిందూహైస్కూలు భవనమునందు శ్రీయుత చన్నాప్రగడ భానుమూర్తి పంతులు గారి అధ్యక్షతక్రింద సమావేశమాయెను. వివిధాంధ్రమండల వాసులును, స్థానిక ప్రముఖులనేకులును మహాసభ కరుదెంచిరి.

## ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము.

ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీ దేశరాజు హనుమంతరావుపంతులుగారు ఆహ్వాన సంఘము తరఫున ప్రతినిధుల నాహ్వానించుచు ఆంధ్రోద్యమము గుంటూరు మండలమున

సందే ప్రారంభ మాయెననియు, సహాయనిరాకరణోద్యమమందును, గుంటూరు మండలము మిగుల ఖ్యాతివహించెననియు, గ్రంథాలయోద్యమమందు ప్రథానస్థానము నాక్రమింపజాలకపోయినను విశేషముగు కృషిసలిపె ననియు పలికిరి. "ప్రతి గ్రామములోను ఒక్కొక దేవస్థానమున కనుబంధముగ నొక్కొక పుస్తక భాండాగార ముండుట వాంఛనీయము. గుంటూరు పట్టణమందలి పురపాలక సంఘ గ్రంథాలయము గ్రంథపఠనమునకే గాక, సమస్త రాజకీయ సాంఘిక మతవ్యవహారములకును, కాలక్షేపములకును కేంద్రస్థానమై యున్నది. ఆర్యవైశ్య గ్రంథాలయమువారు విదేశవ్యాపార వాణిజ్య పరిస్థితుల దెల్పు వార్తాపత్రికలను, నవీన గ్రంథములను వారి భాండాగారమునకు దెప్పించి మిగుల ఉపయుక్తముగు పనిని గావించినవారయ్యెదరు. గుంటూరు మండలమందిక నేటపాలెమునం దిప్పటికి 10 సంవత్సరములక్రింద శ్రీ వూటుకూరి వెంకటసుబ్బరాయ శ్రేష్ఠిగారిచే స్థాపింపబడిన గ్రంథాలయము దినదిన మభివృద్ధినొందుచు, సర్వజనోపకారియై కడు ప్రశంసనీయమగు సేవ గావించుచున్నది. మన దేశమందలి ప్రస్తుత పరిస్థితుల నభివృద్ధిపరచి, ప్రజలలో జాతీయభావప్రబోధము కలుగజేయుటకుగాని స్వరాజ్యసంపాదనకుగాని జనబాహుళ్యమందు విజ్ఞానమును విస్తరింపజేయుట యత్యావశ్యకము. కేవలము పాఠశాలమూలమున నీ విజ్ఞానము వ్యాప్తినొందవలయు ననిన రెండు మూడు తరములు పట్టును. పుస్తకభాండాగారము లీ విజ్ఞానమును త్వరలో ప్రజలందు వ్యాప్తినొందింపగలవు. ప్రతి భాండాగారమునందును దేశ సేవాభిలాషియు, స్వార్థరహితుడును, పండితులు నగు నొకరు ఆభాండాగారము ననుసరించి యుండవలెను. చదువగలవారి కేయే విషయములు చదువవలెనో చదువరాని వారి కేయే విషయములను తాము చదివి చెప్పవలెనో - అట్టి కార్యముల నిర్వర్తింపగల సమర్థులొకరుండినగాని కేవలము గ్రంథము లుండుటవలన నట్టి ప్రయోజనము లేదు. ఈ గ్రంథాలయము లిదివరలో ననేక తావుల నెలకొల్పబడియున్నవి. పరప్రభుత్వమున్నంతవరకును సాంఘికముగగాని రాజకీయముగగాని, మతవిషయముగ గాని మన కెట్టిసహాయము జరుగబోదు. మనకు వారు తగినంత సహాయము గావింపలేదని కొరతపడుటయు యుక్తము కాదు. ప్రభుత్వము వారు సహాయమొనరించినను, చేయకున్నను ప్రజలే యీ యుద్యమవ్యాప్తికి పూనుకొనవలెను. ప్రతి తాలూకా జిల్లాబోర్డులును పురపాలక సంఘములును పుస్తక భాండాగారముల నెలకొల్పవలెను. జిల్లాసంఘము వారు సంచారగ్రంథాలయముల నేర్పాటు చేసి ఆయా జిల్లాప్రజలందరకు యీ యుద్యమలాభముల నందజేయవలెను.

దేవాదాయముల కిప్పుడు ప్రత్యేక చట్టమొకటి యేర్పడియున్నది. ప్రతిగ్రామమందును యీ దేవాదాయము నుంచి వసూలగు ధనములో కొంత గ్రంథాలయమునకై వెచ్చించిన, విద్యావిషయకముగ ప్రజల కెంతయో మేలొనగూడును. ధనమునకై ప్రభు

త్యము వారిపై ఎక్కువగ ఆధారపడియుండరాదు. ఒకవేళ వారు ధనమొసంగినను ప్రజల స్వేచ్ఛ నరికట్టి యనేక నిర్బంధములను ప్రయోగించెదరు" అని పలికిరి.

పిమ్మట శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు మహాసభకు శ్రీ చన్నాప్రగడ భానుమూర్తిపంతులుగారిని అధ్యక్షులుగ నుపపాదించిరి. ఉపపాదన మరికొందరు ప్రముఖులచే బలపరుపబడిన పిదప అధ్యక్షులు తమపదవి నలంకరించి ఉపన్యాసము గావించిరి. అందుండి ఈక్రింది భాగములు ప్రకటింపబడినవి.

## అధ్యక్షోపన్యాసము.

విద్యయనగా అక్షర జ్ఞానరూపమున చక్షురింద్రియద్వారమున గ్రహింపతగినది మాత్రమే కాదు. శాస్త్ర పురాణోపన్యాసాది శ్రవణసాధనముచే శ్రోత్రేంద్రియద్వారమున గ్రహింపతగినవియు విద్యయే. మనస్సంస్కార సాధనములగు నీ యుభయాంశములలోను శ్రోత్రేంద్రియమూలకమగు రెండవయంశమునకే ప్రపంచమున ప్రాచుర్యము కలదు. మన వేదములు శ్రుతులు — మానవులలో అక్షరజ్ఞాన రహితులగువారి జ్ఞానవిజ్ఞాన సంపత్తి యంతయు శ్రుతిమూలకమే. ఏ దేశమందైనను సాక్షరుల సంఖ్య పరిమితమే. మన దేశమున అట్టివారి సంఖ్య అత్యల్పము. ఇక నక్షర జ్ఞానము లేక పెద్దవారైన గతియేమి? అఱువది వత్సరముల వాని కక్షరాభ్యాసము దుష్కరము కదా! అట్టివారి జ్ఞానవిజ్ఞాన లబ్ధికి శ్రోత్రేంద్రియమే శరణ్యము. కావున ప్రతి గ్రామమునను కలిగినవారిపిల్లల విద్యాసంస్కారమునకయి పగటిబడులును లేనివారిపిల్లల సంస్కారమునకై రాత్రిబడులనేగాక, పెద్దల సంస్కారమునకయి గ్రామకూటములు కూడ నేర్పడియుండవలెను. గ్రామకూటములన నేమో వివరింపవలసియున్నది. గ్రామములోని పెద్దవారందరును జ్ఞానాభివృద్ధికయి యొకచోట సాయంసమయమున సమావేశము లై, వారములో కొన్నిదినములు ప్రాచీనశాస్త్ర పురాణాది శ్రవణమూలమున తమ దేశీయ సంప్రదాయ విజ్ఞానమును, ఆత్మజ్ఞానమును - మరికొన్నిదినములు ఆధునికశాస్త్ర వార్తాపత్రికాది శ్రవణమూలమున ఆధునికజ్ఞానమును, లోకజ్ఞానమును, సంపాదింపవలెను. ఇందులకై ప్రతి గ్రామమునకు నొక మందిరము నిర్మింపబడి యుండవలెను. ఇట్టి సంస్థలే గ్రామకూటములు. పిన్నల విద్యాభివృద్ధికి పగటిబడులును, పెద్దలసంస్కారమునకయి గ్రామకూటములును ప్రతిగ్రామమునను ఏర్పడి, ప్రజలకు కొంత సంస్కారము గల్గించి, వారిని జ్ఞానగ్రహణోన్ముఖులను చేసిననే కాని, ప్రజాప్రబోధమునకై నేడు నానాముఖముల సాగుచున్న ఉద్యమములెల్ల నిర్వీర్యములును నిష్ఫలములు నగును. క్షేత్రము చక్కజేసిననగాని బీజములు నాటుకొని అంకురించ నేరవు. పైని చెప్పిన త్రివిధ సంస్థలు లేనిచో మన వార్తాపత్రికలు గాని ధర్మోపన్యాసములుగాని, స్వదేశోద్యమము తదితర ప్రతిష్ఠాపనములుగాని ఫలప్రదములు జయశీలములును గానేరవు.

# గ్రంథాలయ సర్వస్వము.

ఈ విషయమున గ్రామకూటములకు సహకారులై గ్రంథాలయములు చేయవలసిన పని యపారముగా నున్నది. గ్రంథాలయముల వివరమును, అవి యిప్పటి కొనర్చుచున్న మహోపకార విషయమును, ఇక్కడ సమావేశమైనవారి కెల్లను తెల్లమైనదే కావునను, ఆ విషయమును తర్వాత నుపన్యసించు నధికృతులు సెలవిచ్చెదరు కావునను, సంగ్రహముగా వివరించి విరమించెదను. గ్రంథాలయములనగా, పైన జెప్పబడిన జ్ఞానవిజ్ఞానములమూలమున మనుజునకు గావలసిన సంస్కారములను అలవఱచు గ్రంథసామగ్రిని సాకల్యముగ సేకరించియు, భద్రపఱచియు, ఆ గ్రంథములను జనోపయోగమునకై యిండ్లకు బంపుచుండియు, మహోపకారకములగు రాజమహేంద్రవరము బెజవాడ లోనగు పెద్ద పట్టణములలో నెలకొల్పబడిన మహాసంస్థలు. ఇట్టిగ్రంథాలయములు శారదాపీఠములు. అవి యొకరీతి కళాశాలలే. ఇట్టి సంస్థల మూలమున నమెరికా మొదలగు పశ్చిమదేశములలో జరుగుచుండిన మహోపకారమును గుర్తించియే లోకానుగ్రహకాంక్షులగు మనదేశములోనే మహాపురుషులు అట్టి సంస్థలను మనదేశమున ప్రతిష్ఠింపసాగిరి. దేశపురోభివృద్ధిపథమున నన్నివిషయములలోను అగ్రయాయియగు బరోడా మార్గదర్శి యయ్యెను. ఆ సంస్థానమున నిట్టి సంస్థలు ప్రభుత్వ యాజమాన్యమున సాగుచున్నవి. తక్కిన స్వదేశ సంస్థానములు బరోడా చూపిన త్రోవయే పట్టుచున్నవి. ఆంధ్రదేశమున 1898 వ సంవత్సరమున రాజమహేంద్రవరమున స్థాపింపబడిన వీరేశలింగ గ్రంథాలయము ఈ యుద్యమ ప్రథమఫలము, ఇదియే తర్వాత గౌతమీ గ్రంథాలయమయినది. 1899 లో భీమవరం తాలూకా కుముదవల్లి గ్రామమున వీరేశలింగ గ్రంథాలయము అనుపేర నొక గ్రంథాలయమును, 1911 వ సంవత్సరమున బెజవాడలో రామమోహన గ్రంథాలయమను పేర నొకటియును ప్రతిష్ఠింపబడియున్నవి. నేటికి స్వంతమందిరములును కొంతయాస్తియుకల గ్రంథాలయములు, ఆంధ్రదేశమున సుమారు అరువదివరకును గలవు నామమాత్రముగా నున్నవి కొన్ని వందలు గలవు. ఇవిగాక మున్సిపాలిటీ మొదలగు స్థానిక సంస్థలచే నెలకొల్పబడినవియు కొన్ని గలవు. కాని వీని సంఖ్యయు చేయవలసినపనియు కావలసినదానిని విచారించిన అత్యల్పమని చెప్పక తప్పదు. 1913 వ సం॥న నాంధ్రోద్యమము వచ్చునదాక యీ సంస్థలు ప్రత్యేక వ్యక్తులుగ పనిచేయుచుండెను. వీనికి సమష్టిజీవితమేర్పడి ఈ విషయమున సాగుచుండెడి ఉద్యమము యేకముఖమయి బలపడలేదు. 1914 వ స.|న బెజవాడలో ఆంధ్రగ్రంథాలయసంఘమను పేర నొక సమిష్టిసంస్థయేర్పడి ఆంధ్రగ్రంథాలయసర్వస్వపత్రికాముఖమున ఈ యుద్యమ ప్రచారము సాగించినది. ఆకాలమున ఈగ్రంథాలయోద్యమమును, వార్తాపత్రికోద్యమమును కొంత ప్రబోధము గల్గించినవి. కాని మనదేశమునకు పూర్వోక్తమయిన ఈశ్వరోద్దిష్ట ప్రయోజనము సిద్ధించుటకయి వలయు సంస్కా

ములవరచుట అదృష్టశ్రుతపూర్వమగు మహాకార్యము. ఇట్టి కార్యభార నిర్వహణము కొనసాగించుటకు గ్రంథాలయము లుత్కృష్ట సాధనములు గాజాలియున్నవి. పైని చెప్పిన ప్రతిగ్రామకూటములకును, అనుబంధముగా నొక్కొక్క గ్రంథాలయమేర్పడి, పనిచేసినచో నీయుద్యమ బీజములు నలుదిక్కులనాటుకొని, అంకురించి, కొనలుసాగి, శాఖోపశాఖలలెంది దేశమును గప్పగలవు. పగటి పాఠశాలలకును రాత్రిపాఠశాలలకు గ్రామకూటములకును గ్రంథాలయములకును అనుబంధములుగా నేర్పడి,అందు నేర్పబడువిద్యవిషయమున పైనవివరింపబడిన కొదువలు దీర్చనగాని, విద్యాబోధ సర్వతోముఖముగ సాగజాలదు. ఈ చతుర్విధ సంస్థల విషయమునను వానిలో వాని కుండవలసిన యన్యోన్య సహకారభావమును గురించియు కొన్ని విషయము లుపన్యసింపవలసియున్నది. గ్రంథాలయమున కార్యదర్శియు నధ్యక్షుడు నుండును. బడులలో కొందరుపాధ్యాయులుండుదురు. వీరుగాక గ్రామములో గాని తత్పరిసర గ్రామములలో గాని ఆంధ్రగీర్వాణములుగాని యొకయాంధ్రమే గాని తెలిసిన పండితుడొక డుండకపోడు. మరియు నీ కాలమున ప్రతి గ్రామములోను ఆంగ్లభాషాజ్ఞానమును ఆధునిక సంస్కారమునుగల యొకరిద్దరు వ్యక్తులుందురు. వీరల సాహాయ్యమున పైని వివరించిన జ్ఞానవిజ్ఞాన బోధ సాగించు పనిలో నపార సౌకర్యము లొదవును. గ్రామవాసు లీయుత్కృష్ట కార్యము నిర్వహించుటకుగాను మాసమున కిరువదిరూపాయలు చందాలరూపమున చేర్చవచ్చును. కోర్టుదావాలు తగ్గించుకొని పంచాయతీలచే తగవులుదీర్చుకొని యందుకు ప్రతిఫలముగా కొంతమూలధనము గూర్చి నీ కార్యమున కెంతయు సాహాయ్యభూత మగును. లేదా లోకలుబోర్డులు మొదలగు స్థానికసంస్థలభిక్ష నపేక్షింపవచ్చును. ఈ మొత్తములో మాసమునకు పది రూపాయల వేతన మేర్పరచిన పండితుడు దొరకును. అంతియ వేతన మొసంగిన ఆంధ్రవార్తాపత్రికలను ఆంధ్రములో రచింపబడిన యాధునిక శాస్త్రగ్రంథములను జదివి అందలి విషయములు గ్రామకూటములో సమావేశమయినవారికి దెలుపగల యొకవ్యక్తి లభ్యమగును. అనేక సందర్భములలో బడులలోని యుపాధ్యాయు యీ పని కమరియుండును. ఇట్టివాని సాహాయ్యమున వారములో కొన్ని దినములు ఆరోగ్య శాస్త్రము కృషిశాస్త్రము లోనుగాగల యాధునిక విజ్ఞానమును- కొన్ని దినములుగాని ప్రతిదినమును అరగంటకాలముగాని లోకవార్తలను సమావేశమయినవారికి బోధింపవచ్చును. పైనచెప్పిన పండితుని మూలమున కొన్నిదినములు పురాణాదికాలక్షేపాదులచే సనాతన ధర్మోపదేశమును పరమార్థవిషయబోధయు సాగింపవచ్చును. గ్రంథాలయమున కనుబంధముగా కొన్ని యాంధ్రవార్తాపత్రికల దెప్పించుచుండవలెను. అట్లయిన కావ

గ్రంథములకును పత్రికలకును కొదువయుండదు. గ్రంథాలయాధ్యక్షుడును కార్య

గ్రామవాసులును గ్రామములో కొంతపలుకుబడియు కొంతసంస్కారమును

గలవారై యుండురుగాన వారే గ్రామకూటమున కర్తృత్వమును కార్యదర్శిత్వమునై యుండి, పైనిచెప్పిన కార్యభారము నిర్వహింప దక్షులై యుందురు. ఇట్టివారు విక్షేపము లేకుండ నిశ్చలదీక్షతో కార్యభారము నిర్వహింపగలుగుటకుగాను స్వతంత్ర జీవనములను గ్రామరక్షులలో జేరనివారును, పరోపకారరతులును నయశీలసంపన్నులును గా జూచి యేర్పరుచుకొనవలెను. అట్టివీరప్పటప్పట స్థలాంతర విద్యార్థుల సాహాయ్యమించి గ్రామస్థుల సమావేశముచేసి వారి జ్ఞానాభివృద్ధికొరకును ఉద్బోధముకొరకును ఉపన్యాసములను చర్చలను జరిగించవలెను.

ఈ సందర్భమున ప్రజాప్రబోధమున కుత్తమసాధన మగు ప్రచారకుల సంఘమును గురించి కొంత చెప్పవలసియున్నది. ఇది శాఖాసంక్రమణమేమో యని భ్రమపడుదురేమో. అట్టిభ్రమ అసాంప్రతము. పైని చెప్పిన దానినిబట్టి గ్రంథాలయము సర్వవిధములైన జ్ఞానవ్యాపక సంఘములకును, ప్రచారక సంఘములకును, శరీరావయవసముదాయమునకు శిరమువలె, నుత్తమాంగముగా నుండవలసినది. జ్ఞానవ్యాప్తికిని, ధర్మప్రచారమునకును సాధన భూతములగు సర్వసంస్థలకును, గ్రంథాలయములకును అంగాంగ సహకారభావము కలదు. గ్రంథాలయము ప్రధానాంగము. తదితరములు, దానిపై పరామరికకులోనై అది చేయు పనిలో దానికి సహకారులై దాని ప్రోపున పోషణ వర్ధనములనందునవై ప్రవర్తించవలెను. కావున, బడులు గ్రామకూటములు, గ్రంథమాలలు, వార్తాపత్రికలు, ప్రచారక సంఘములు లోనగునట్టి సర్వసంస్థలను గురించిన విషయములకు గ్రంథాలయ విషయమున అనుప్రవేశము కలదు. కావున ప్రచారక సంఘ విషయమునకూడ నించుక చెప్పవలసి యున్నది. ప్రజోద్బోధనమునకు ప్రచారక సంఘములత్యవశ్యకములు. గ్రామసంచారము చేయుచు పటములు, మాజికులాంతర్లు మొదలగు పరికరసహాయ్యమున ఆరోగ్య శాస్త్రము, కృషిశాస్త్రము, రసాయనశాస్త్రము, ప్రకృతి శాస్త్రము లోనగాగల యాధునిక శాస్త్రవిషయమున బోధసాగించుట కనేక సంఘములు నెలకొల్పబడి పనిచేయుచుండవలెను. గ్రంథాలయ సంఘమిట్టి సంస్థలకన్నిటికిని శిరస్థానమయి యుండవలెను. ఇట్టి సంస్థల నెలకొల్పి వున విద్యాధురీణులు ధర్మదీక్షను, కార్యోత్సాహము కలవారయి వారి మూపున నిల్చియున్న పైనిచెప్పిన మహా కార్యభారము నిర్వహింప నప్రమత్తులయి నిరంతర పరిశ్రమకు గడంగుదురుగాక! సర్వసదుద్యమాధారుడగు పరమేశ్వరుడు వారి యుద్యమములసఫలము లొనర్చుగాత!

## తీర్మానములు.

1 ఆంధ్రులయందు ప్రబోధమునుగావించి ఆత్మవిశ్వాసమును, ఆత్మగౌరవము నెలకొల్పినట్టియు, భారతదేశమునందంతటను ఆంధ్రుల ప్రఖ్యాతిని వెల్లడిజేసి తన సర్వస్వమును మాతృ దేశారాధనకై సమర్పించినట్టి శ్రీరామభక్తులగు అం

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి అకాలమరణమువలన భారతదేశము నంతకు కలిగిన తీరని లోపమునకు యీ సభవారు చింతిలుచు వారి యాత్మజులకు తమ సానుభూతిని తెలుపుచు వారి యాత్మకు శాంతి గలుగుగాక యని పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

2 ప్రజలయొక్క సర్వవిధములగు అభివృద్ధికి ముఖ్యసాధనము జ్ఞానాభివృద్ధి గనుకను, అందుకు తగిన సాధనములు ప్రస్తుతము మనదేశమున లేకపోవుటచే ప్రజలు దుస్స్థితియందుండుటచే — యీక్రిందివిధాన మనుసరించిన సంస్థలను వెంటనే నెలకొల్పుటకు ప్రజలనున్నూ, స్థానిక సంఘముల వారినిన్నీ యీ సభవారు హెచ్చరించుచున్నారు.

(క) ప్రజలకు అవసరమగు విషయములగూర్చి వారికి దెలియువిధమున ఉపన్యసించగల సంచారబోధకులను నియమించుట — వారి బోధనకు సాధకముగ నుండుటకు కరపత్రములను ప్రచురించుట, మాజిక్ లాంతరు సహాయము చేకూర్చుట.

(చ) తాత్కాలిక పాఠశాలల స్థాపించుట.

(ట) సంచార గ్రంథాలయ పేటికలను స్థాపించి, గ్రామములలోను పట్టణములలోను వ్యాపింపజేయుట.

3. (క) గుంటూరు బెజవాడ మ్యునిసిపలు సంఘములవారు సార్వజనిక ధర్మగ్రంథాలయములను నెలకొల్పి జ్ఞానాభివృద్ధికి తోడ్పడు చున్నందులకున్ను, తెనాలి తాలూకా యందలి గ్రంథాలయముల కొఱకుగాను రు 1000-0-లు గ్రాంటు యిచ్చిన ఆబోర్డువారిని ఆ మ్యునిసిపాలిటీలను యీ సభవారు అభినందించుచున్నారు.

(చ) ఆంధ్రదేశమునందలి యితర మ్యునిసిపాలిటీలుకూడ సార్వజనిక ధర్మగ్రంథాలయములను స్థాపించుటకు యీ సభవారు కోరుచున్నారు.

(ట) ఆంధ్రదేశమునందలి ప్రతి తాలూకాబోర్డును తమ ప్రధాన పట్టణములందు ఆ తాలూకాయందలి ధర్మగ్రంథాలయములకు సహాయకముగ నుండునటుల నొక కేంద్ర గ్రంథాలయమును నెలకొల్పుటకు యీ సభవారు కోరుచున్నారు.

4. (క) ప్రస్తుతము గ్రంథాలయముల నిమిత్తము స్థానిక ప్రభుత్వమువారు యిచ్చుచున్న గ్రాంటు అత్యల్పముగానుండి అనవసరమగునట్టియు, ధర్మగ్రంథాలయోద్యమమునకు అనర్థకమైనట్టియు, ప్రతిబంధములతో గూడియున్నది.

(చ) ఆంధ్రదేశమునందలి గ్రంథాలయములకు మాత్రము లక్షరూప్యములకు తక్కువగాకుండ స్థానికబొక్కసము నుండి ప్రతి సంవత్సరము యిచ్చుచుండవలెను.

(ట) గ్రంథములను కొనుటకు ప్రస్తుత మేర్పడియున్న జిల్లావిద్యాశాఖాధికారియొక్క అమోదమును తీసివేయవలయును.

RSVM01 A131

16



(ఉ) గవర్నమెంటు వారు జి. ఓ. రూపముగ బహిష్కరించిన గ్రంథములు తప్ప తదితర గ్రంథముల విషయమున గ్రంథాలయములు తయారు చేసిన లిస్టుల ప్రకారము గ్రాంటులీయవలెను.

5. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు ప్రజలయొక్క తగిన తోడ్పాటు లేకపోవుటచే ధర్మ గ్రంథాలయోద్యమ కార్యవిధానము తృప్తికరముగ సాగుటలేదు. కాన యిట్టి లోపమును నివారణజేసి, దేశాభివృద్ధికి ముఖ్యసాధనమగు ప్రజల జ్ఞానాభివృద్ధికై నెలకొల్పబడిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ కార్యక్రమము సక్రమముగ నడుపుటకుగాను తగిన ద్రవ్యసహాయమును, యితరవిధముల ప్రోత్సాహమును యిచ్చుటకుగాను ప్రజలను, స్థానిక సంస్థలను యీ సభవారు ప్రార్థించుచున్నారు.

6. గౌతమీ గ్రంథాలయమునకు ఇదివరలో అమూల్యమగు విరాళము నిచ్చి ఆంధ్రదేశ ధర్మ గ్రంథాలయోద్యమమునకు ప్రోత్సాహము గలుగజేసిన శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారు ఆగ్రంథాలయము యొక్క స్త్రీశాఖకు మరల రు 20,000 రూప్యము లొసంగి మహోపకారము చేసినందుకు, శ్రీ వారికి యీ సభవారు కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నారు.

7. ఉదకమండలములోని పబ్లికు లైబ్రిరీలో చదువరులు ప్రేక్షకులు ప్రవేశించుటకు దర్బారు దుస్తులు ధరింపవలెనను నిబంధన అక్రమమని సభవారు అభిప్రాయపడుచు అట్టి నిబంధనలను తొలగించుటకు గవర్నమెంటువా రుత్తర్వు చేయవలెనని యీ సభవారు కోరుచున్నారు.

---

## గ్రంథములు

శ్రమము నొందుచు గ్రంథముల్ చదివెనేని
జ్ఞానవంతుడై నరుడెంతో సౌఖ్యపడును
పాటుపడుటచే జెమ్మట పట్టెనేని
గాలిసౌఖ్యంబు వానికే గలదు గాదె॥
పెట్టెలోన జాగ్రత్తగా బెట్టి దాచు
కప్పురపు పేర్లు హరియించు కరణి నకట
జనుల యశ్రద్ధచేత భాషామతల్లి
గ్రంథముల డాగి కృశియింపగా గడంగె॥

—ఆచంట సూర్యనారాయణ సాంఖ్యాయనశర్మ.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 131 |
| పుస్తకం పేరు | గంగాలహరి స్తోత్రము |
| తారీఖు | 7/6/22 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 17 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | |
| పరిస్థితి | |